సాక్షి
ఖమ్మం
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025

సొంత ఇల్లు వదిలేసి..

వెంకటేశ్వరనగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి కె.కిరణ్ చిన్నప్పుడే ఆయన తండ్రి, కొన్నేళ్ల క్రితం తల్లి మృతి చెందగా ఇల్లు వరదల్లో కొట్టుకుపోయింది. వేరే ఇంట్లో అద్దెకు ఉంటూ సొంతింటిని వదిలేశాడు.



మరమ్మతులు చేయించలేక వెంకటేశ్వర నగర్‌లో కిరణ్ వదిలేసిన ఇల్లు

న్యూస్‌రీల్

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి అండర్ – 15 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ముగిశాయి. బాలుర సింగిల్స్ విజేతగా వరంగల్‌కు చెందిన శ్రీచేతన్ శౌర్య టైటిల్ దక్కించుకోగా, రెండో స్థానాన్ని చరణ్(మేడ్చల్) కైవసం చేసుకున్నాడు. బాలికల సింగిల్స్ టైటిల్‌ను అవిని విక్రమ్ గోవింద్(రంగారెడ్డి) నిలబెట్టుకోగా ద్వితీయ స్థానంలో ప్రొద్దుటూరు అనన్య (మేడ్చల్) నిలిచింది. బాలుర మూడోస్థానంలో చిన్మయి వాంఖడే(రంగారెడ్డి), చరణ్ హర్షిక్ విరాట(సంగారెడ్డి), బాలికల విభాగంలో శృతి(సంగారెడ్డి), ఆగర్వాల్(హైదరాబాద్) మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. బాలుర డబుల్స్‌లో చరణ్(మేడ్చల్), శ్రీచేతన్‌శౌర్య(వరంగల్) జోడీ ప్రథమ స్థానంలో, విధిత్‌రెడ్డి, కిషోర్ పాల్(రంగారెడ్డి) రెండోస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో అక్షర(హైదరాబాద్), తనిష్క(మేడ్చల్) జోడీ టైటిల్‌ను కైవసం చేసుకోగా, శ్రీవైభవ(నిజామాబాద్), ప్రొద్దుటూరు అనన్య(మేడ్చల్) ద్వితీయస్థానం దక్కించుకున్నారు.

విజేతలకు సీపీ బహుమతులు..

బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ బహుమతులు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబర్చారని అభినందించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అడిషనల్ ఎస్పీ గంటా వెంకట్రావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం మాట్లాడగా కార్పొరేటర్ కమర్తపు మురళి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వి.చంద్రశేఖర్, సిరిపురపు సుదర్శన్ రావు, పి.రవిమారుత్, పి.యుగంధర్, కొంగర శ్రీను, జట్ల శ్రీను, మల్లికార్జున్, రఘు పాల్గొన్నారు.


పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి ఎన్నికైన సభ్యులు

ఖమ్మం సహకారనగర్ : పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన గౌరవ సలహాదారు పోట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దుబాకుల శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కొమ్మినేని అనిల్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా మట్టా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ముత్తినేని సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్యా వీరేంద్ర, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా బి.రవికుమార్, మహిళా అధ్యక్షురాలిగా దిగుమర్తి శిరీష, రాష్ట్ర కార్యదర్శిగా షేక్.కుదుస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా షేక్ సోందు, యాస రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంబటి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా చావా శ్రీదేవి ఎన్నికయ్యారు.

కిన్నెరసానిని సందర్శించిన జిల్లా జడ్జి



జలాశయంలో బోటుషికారు చేస్తున్న జడ్జి తదితరులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని జిల్లా జడ్జి రాజగోపాల్ కుటుంబసమేతంగా ఆదివారం సందర్శించారు. డీర్‌పార్కులో దుప్పులు, జలాశయాన్ని వీక్షించారు. ఆ తర్వాత రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. కాగా, కిన్నెరసానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20,835, టూరిజం కార్పొరేషన్‌కు రూ.9,820 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాళరాత్రికి ఏడాది

ఎప్పటిలాగే వారంతా రేపటిపై ఆశలతో నిద్రించారు. కానీ తెల్లారేసరికి వారి కలలు ఛిద్రమయ్యాయి. కాయకష్టంతో నిలబెట్టుకున్న గూడు.. ఇతర సామగ్రిని గంగమ్మ తనలో కలిపేసుకోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. గతేడాది ఆగస్టు 31న మున్నేరు పరీవాహకంలోని మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ తరహా భారీ వర్షం కురవగా మున్నేటికి పోటెత్తిన వరద ఖమ్మం నగరాన్ని ముంచెత్తింది. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం కల్లా పరీవాహకంలోని సుమారు 60 కాలనీలు నీటమునగగా స్థానికులు ప్రాణాలతో మాత్రమే బయటపడ్డారు. మున్నేటికి రికార్డు స్థాయిలో వరద వచ్చి నేటి(సోమవారం)తో ఏడాది అవుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



గ్రౌండ్ రిపోర్ట్



వెంకటేశ్వర నగర్‌లో మరమ్మతులు చేయలేక వదిలేసిన ఇల్లు

గతేడాది ఇదేరోజు ముంచెత్తిన మున్నేరు

- పరీవాహక బాధితులను ఇంకా వీడని భయం
- ఇప్పటికీ పలు చోట్ల ఖాళీగానే ఇళ్లు
- రిటైనింగ్ వాల్ పూర్తయితే గట్టెక్కుతామని నమ్మకం

వరద తాండవం

ఎగువన భారీ వర్షాలతో గతేడాది ఆగస్టు 31 అర్ధరాత్రి నుంచి సెప్టెంబర్ 1 తెల్లవారుజామున 3 గంటల వరకు 19 అడుగులుగా ఉన్న మున్నేరు వరద ఉదయం 11 గంటలకల్లా 36.9 అడుగులకు చేరింది. గంటకు 3 – 4 అడుగుల మేర పెరుగుతూ ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. అయితే, ఇక్కడ వరద 36.9 అడుగులు కాదు 41 అడుగులకు చేరిందని అధికారులు ఆ తర్వాత ప్రకటించారు. అనూహ్యంగా వరద రావడంతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలంలోని 60 కాలనీల ప్రజలు కనీస సామగ్రి తీసుకునే వీల్లేకుండానే పునరావాస కేంద్రాలకు వెళ్లారు. వీరిలో అత్యధికంగా రోజువారీ కూలీలే కాగా.. ఇళ్లలో బురద మేటలు వేసి కొన్ని చోట్ల పూర్తిగా, ఇంకొన్ని చోట్ల పాక్షికంగా నేలమట్టమయ్యాయి. పైసా పైసా కూడబెట్టుకుని కొనుక్కున్న గ్యాస్‌స్టౌలు, బియ్యం, మంచాలు, దుప్పట్లు, ఫ్రిడ్జ్‌లు, బీరువాలు తదితర సామగ్రి, దాచుకున్న సొమ్ము తుడిచిపెట్టుకుపోయింది.

వర్షం మొదలైతే భయం

మునుపెన్నడూ లేని రీతిలో గత ఏడాది మున్నేటికి వరద రాగా ప్రభావిత కాలనీల ప్రజలు ఇప్పుడిప్పుడే సాధారణ జీవితానికి అలవాటుపడుతున్నారు. అయినా చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. ఉలిక్కిపడుతున్నారు. ప్రస్తుత వర్షాలతో మళ్లీ ఎక్కడ వరద వస్తుందోనన్న ఆందోళనతో వారిలో కంటి మీద కునుకు కరువవుతోంది. ప్రస్తుతం మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతుండడం కొంత ఊరట కలిగిస్తోంది.

పరిహారం కోసం..

వరదల సమయాన ఇంటింటా అధికారులు వివరాలు సేకరించారు. ఒక్కో కుటుంబానికి రూ.16,500 చొప్పున 9,725 మందికి రూ.15,60,30,000 ఆర్థిక సాయం అందినా 2,170 కుటుంబాలకు ఎదురుచూపులే మిగిలాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతేనే వీరికి సాయం అందనుంది.



4వ తరగతి ఉద్యోగుల కాలనీలో టు-లెట్ బోర్డు పెట్టిన ఇల్లు

ఖాళీగా దర్శనమిస్తూ..

మున్నేరు పరీవాహక ప్రాంతంలోని అనేక ఇళ్లకు ఇంకా టు – లెట్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. అనేకమంది అద్దె ఇళ్లలో ఉంటుండగా.. ఇంకొందరు ఇతర ప్రాంతాలకు మారారు. అలాగే, మున్నేరు సమీపాన దెబ్బతిన్న ఇళ్లకు కొందరు మరమ్మతు చేయించకుండానే వదిలేశారు. ఇళ్లలో ఉంటున్న వారు కూడా పైపై మరమ్మతులు చేయించుకుని.. ఏవైనా కార్యాలు ఉంటే రంగులు వేయించుకుంటున్నామని చెబుతున్నారు.

వరదలు ముంచెత్తినా..

వెంకటేశ్వరనగర్‌లో బీరప్ప గుడి వెనుక వైపు కాలనీవాసులు గత 20 ఏళ్లుగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించే లింగస్వామి, విఠల్, సాత్విక్ తదితరులతో కూడిన కమిటీ గత ఏడాది ఇబ్బంది పడింది. కాస్త వరద తగ్గగానే కొంత డబ్బు సమకూర్చుకుని నాలుగు అడుగుల విగ్రహం ఏర్పాటుచేశారు. ఈసారి మాత్రం 10 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఇక పదిహేనేళ్లుగా బొక్కలగడ్డ, మంచికంటినగర్‌లో వినాయక నవరాత్రులు నిర్వహించే బి.శ్రీను, నాగరాజు, మురళి, ఎల్లబోయిన వేణు తదితరులు గత ఏడాది వేడుకలపై దృష్టి సారించలేదు. ఈసారి మాత్రం మంచికంటినగర్‌లో 16 విగ్రహాలు ఏర్పాటయ్యాయి.



గణేశ్ మండపం వద్ద మంచికంటినగర్ వాసులు

రూ.లక్షల నష్టానికి రూ.వేల పరిహారం



మా ఆయనకు ఆరోగ్యం బాగుండక నేనే పనికి వెళ్తున్నా. వరదలతో రూ.1.50లక్షల సామగ్రి నష్టపోతే వచ్చిన రూ.10వేలు ఎటూ సరిపోలేదు. ఇంటి మరమ్మతుకు అప్పు చేయలేకపోయాం.

– మామిళ్ల అంజమ్మ, వెంకటేశ్వరనగర్, ఖమ్మం

మనుషులమే మిగిలాం..



గత ఏడాది వరదతో ఇంటి కప్పు, సామగ్రి పోయి మనుషులమే మిగిలాం. గత ఏడాది వినాయక చవితి ముందు వరద వచ్చింది. ఈసారి చవితే ముందు రావడంతో వరద రాదని అనుకుంటున్నాం.

– మచ్చ ఉప్పలమ్మ, వెంకటేశ్వరనగర్, ఖమ్మం

పాడైన ఇల్లు బాగు చేయించలేదు..



వరదకు మా ఇల్లు మునిగి చుట్టూ గోడలు కూలిపోయాయి. ఈ ఏడాది మళ్లీ వరద వస్తుందని గోడలు కట్టించలేదు. రంగులు వేయించలేదు. కరకట్ట కట్టాక ఇక్కడ ఉండాలో, లేదో చూస్తాం.

– ఇమ్మడి అరుణ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, కరుణగిరి

'ఫైర్' కష్టాలకు త్వరలో చెక్!

- అగ్నిమాపక కేంద్రానికి త్వరలో అధునాతన భవనం
- రూ.3 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

ఖమ్మంక్రైం : జిల్లా అగ్నిమాపక శాఖ సిబ్బంది కష్టాలు ఇక తీరనున్నాయి. ఖమ్మంలో అనేక సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న ఫైర్ స్టేషన్‌కు త్వరలో అధునాతన భవనం నిర్మాణం కానుంది. ఎప్పుడు కూలుతుందో తెలియక.. పాములు, తేళ్లతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఉద్యోగులు ఇక ప్రశాంతంగా విధులు నిర్వర్తించే అవకాశం కలగనుంది.

1998లో ఎన్నెస్పీ క్యాంప్‌లోకి..

ప్రస్తుత షాదీఖానా స్థలంలో అంతకుముందు అగ్నిమాపక కేంద్రం ఉండేది. 1998లో ప్రభుత్వం ఆ స్థలాన్ని షాదీఖానాకు కేటాయించగా.. ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఓ భవనంలోకి అగ్నిమాపక కేంద్రాన్ని మార్చారు. డీఎఫ్‌ఓ, ఏడీఎఫ్‌ఓతో పాటు ఖమ్మం నగర అగ్నిమాపక అధికారి కార్యాలయాలు కూడా ఇక్కడే నిర్వహించేవారు. అయితే క్రమంగా ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో ఖమ్మం నగర కార్యాలయాన్ని మాత్రమే అందులో ఉంచి మిగతా వాటిని అద్దె గదుల్లో నడిపిస్తున్నారు. ఆ భవనం ఇటీవల మరింతగా కుంగిపోగా.. పక్కనున్న ఖాళీ స్థలంలో రేకులతో రెండు గదులు వేశారు. అవి అగ్నిమాప క అధికారి, సిబ్బందికే సరిపోతుండడంతో వాహనాలు మాత్రం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయి.



అగ్నిమాపక కార్యాలయం నిర్మించే స్థలం ఇదే..

ఎట్టకేలకు నిధులు..

అగ్నిమాపక శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరగా.. నూతన భవనం నిర్మించాలని దాదాపు 20 ఏళ్లుగా అధికారులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. గతంలో రెండుసార్లు భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా తిరిగి వెనక్కు వెళ్లాయి. ఆ తర్వాత కూడా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఎట్టకేలకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఈ భవనాన్ని నిర్మించనుండగా ఆర్‌అండ్‌బీ, అటవీ అధికారులు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

అన్ని కేంద్రాలూ ఈ భవనంలోనే..

ఎన్నెస్పీ క్యాంప్‌లో ప్రస్తుతం 1,152 గజాల స్థలం అగ్నిమాపక కేంద్రం ఆధీనంలో ఉంది. ఇందులోనే జిల్లా ఫైర్ అధికారి, సహాయ అధికారి, నగర ఫైర్ ఆఫీసర్ కార్యాలయాలు నిర్మించనున్నారు. భవనం కింది భాగంలో అగ్నిమాపక వాహనాలు పార్కింగ్ చేస్తారు. అయితే తాత్కాలికంగా కార్యాలయాల నిర్వహణ, వాహనాల పార్కింగ్ కోసం సిబ్బంది ప్రత్యామ్నాయ స్థలాన్ని అన్వేషిస్తున్నారు. అది లభ్యం కాగానే.. ప్రస్తుత నిర్మాణాలను తొలగించి నూతన కట్టడాలను ప్రారంభిస్తారు. ఈ మేరకు తాత్కాలిక స్థలం కేటాయించాలని అధికారులు కలెక్టర్‌ను కోరారు.

47.90 అడుగులకు గోదావరి

భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగి.. తగ్గిన నీటిమట్టం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 47.90 అడుగులుగా నమోదైంది. ఆదివారం ఉదయం 8:54 గంటలకు వరద 48 అడుగులు దాటి ప్రవహించడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకూ గోదావరి నీటిమట్టం 47.50 అడుగుల వద్ద నిలకడగా కొనసాగింది. అనంతరం 5 గంటల నుంచి స్వల్పంగా పెరుగుతూ 8:54 గంటలకు 48 అడుగులకు చేరింది. దాదాపు ఐదుగంటలపాటు నిలకడగా కొనసాగి, మధ్యాహ్నం 1:05 గంటలకు స్వల్పంగా తగ్గి 47.90 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 8 గంటల వరకు కూడా గోదావరి నీటిమట్టం 47.90 అడుగుల వద్ద నిలకడగానే ఉంది. సోమవారం తెల్లవారుజాము నుంచి భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా ఆగస్టు 20న మొదటిసారి ఒకే రోజు మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలను దాటి గోదావరి వరద నీరు ప్రవహించింది. 21న 51.9 అడుగులకు చేరుకుని వరద తగ్గుముఖం పట్టింది.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

- దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు పాలన సాగిస్తున్నాయి
- ఓట్ల చోరీపై నేడు పాట్నాలో నిరసన ర్యాలీ
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న ప్రదీప్ సింగ్ ఠాగూర్

ఖమ్మంమయూరిసెంటర్ : ఏకీకృత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నుతున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు ఖమ్మంలో మాస్‌లైన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించామని, దేశంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలు, మతోన్మాదం పేరుతో సాగిస్తున్న హింస, ఓట్ల చోరీపై చర్చించామని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్నాయని, లౌకికతత్వాన్ని, సర్వమత సహజీవన సమాజాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో లక్షలాది మంది బలహీన వర్గాల వారి ఓటు హక్కు రద్దు చేశారని అన్నారు. దీనికి నిరసనగా నేడు(సోమవారం) పాట్నాలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, మహిళలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతిపై సుంకం రద్దును డిసెంబర్ 31 వరకు అమెరికా పొడిగించిందని, ఇది రైతులకు ప్రమాదకరమని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. వర్షాలు కురిసి పంటలు సాగు చేసే సమయంలో రైతులకు యూరియా అందకుండా పోతోందని, యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవగాహన లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో పంచాయతీలకు నిధులు మంజూరు కావడం లేదని, దీంతో గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి సుభాష్ దేవ్, కేంద్ర కమిటీ సభ్యులు దేవవ్రత శర్మ, కేజీ రామచందర్, కె.రమణ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఉమాకాంత్, పూజారి కృష్ణ గోగోయ్, భీమల్ పాండే, వి.కృష్ణ, కె.సూర్యం, సి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్.. ఇక స్పీడ్

- బియ్యం సేకరణపై యంత్రాంగం దృష్టి
- క్షేత్రస్థాయిలో మిల్లులకు వెళ్లి పరిశీలన



ఓ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) వసూళ్లను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గడువు ముగుస్తున్న క్రమంలో సీఎంఆర్ త్వరితగతిన ఇవ్వాలని మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈనెల 12 వరకు గడువు ఉండగా ఈలోపే 100 శాతం సీఎంఆర్ వసూలు చేయాలని నిర్ణయించుకుని.. క్షేత్రస్థాయికి వెళ్తున్నారు.


2.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..

2024 – 25 సంవత్సర ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని 21 మండలాల పరిధిలో 2,80,364.540 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించారు. ఇందులో 67 శాతం అంటే.. 1,87,844.242 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖకు సీఎంఆర్‌గా ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 1,66,448.752 మెట్రిక్ టన్నులు అందించగా 21,338.489 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఈనెల 12వ తేదీ లోపే మొత్తం బియ్యం సేకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

రబీలోనూ పెండింగే..

2024 – 25 సంవత్సర రబీలోనూ మిల్లర్లు ఇవ్వాల్సిన సీఎంఆర్ పెండింగ్‌లోనే ఉంది. ఈ సీజన్‌లో 1,60,558 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 52,243.663 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వగా.. ఇంకా 56,133.337 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. కాగా మొత్తంగా ఇప్పటివరకు మిల్లర్లు 48 శాతం బియ్యమే అప్పగించగా.. గడువు సమీపిస్తున్న క్రమంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

వేగవంతం చేస్తున్నాం



జిల్లాలో బియ్యం సేకరణ వేగవంతం చేస్తున్నాం. ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉంది. ఈ మేరకు పెండింగ్ ఉన్న సీఎమ్మార్‌ను త్వరగా ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించాం. క్షేత్రస్థాయిలో సైతం మిల్లులను తనిఖీ చేసి బియ్యం వెంటనే అప్పగించేలా ఒత్తిడి పెంచుతున్నాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మతల్లి అమ్మవారిని ఖమ్మం జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయంలో దుకాణాలు, చీరలు పోగు చేసుకోవడం, పూల దండల విక్రయానికి మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ హక్కులు పొందేందుకు వ్యాపారులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

3న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



దామరచర్లలో ముస్తాబవుతున్న సభావేదిక

చంద్రుగొండ : ఈ నెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పర్యటన దాదాపు ఖరారైనట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం తెలిపారు. గత నెల 21, అనంతరం 30న చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామంలో సీఎం పర్యటన ఖరారు కావడంతో ఏర్పాట్లు చేశారు. అయితే అనేక కారణాలతో సీఎం సభ రెండుసార్లు వాయిదా పడింది. మళ్లీ పర్యటన ఖరారైన నేపథ్యంలో బెండాలపాడు గ్రామంతోపాటు చంద్రుగొండలోని హెలీప్యాడ్ వద్ద, దామరచర్ల గ్రామంలో సభాస్థలిలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్‌తో లాభం



మాట్లాడుతున్న ఆయిల్‌పాం రైతులు

సత్తుపల్లి: మండలంలోని పాకలగూడెంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్‌తో రైతులకే లాభం ఉందని ఆయిల్‌పాం రైతులు చీకటి చిట్టీరావు, పొన్నగంటి జోగారావు తెలిపారు. మండలంలోని కిష్టాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్ కోసం పలుమార్లు విన్నవించుకోగా ఆయిల్‌ఫెడ్ కమిటీ పరిశీలించి అనుమతి ఇచ్చిందని, దీంతో సత్తుపల్లి మండలంలోని ఆయిల్‌పాం రైతులకు గెలలు ఫ్యాక్టరీకి పంపించటం తేలికైందన్నారు. సమావేశంలో రైతులు హసావత్ కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎన్.లోకేశ్వరరావు, దేవరపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అదృశ్యంపై ఆదివారం ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలీ) పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్సార్ కాలనీలో నివసించే పొట్లపల్లి నారాయణ(45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఆటోతో ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం తన భార్యకు ఫోన్ చేసి తన మనసు బాగోలేదని చెప్పి కాల్ కట్ చేశాడు. తిరిగి ఆమె ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. బంధువులతో కలిసి గాలించగా నగర శివారు ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని సాగర్ ప్రధాన కాల్వ పక్కన ఆటో నిలిపి ఉంది. నారాయణ కనిపించకపోవడంతో భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోయి ఆటో బోల్తా కొట్టడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటనపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపూరం గ్రామానికి చెందిన చిర్రా నరేశ్ (29) శనివారం రాత్రి సమయంలో సుబ్లేడు అత్తగారింటికి తన సొంత ఆటోలో వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోగా ఆటో రోడ్డు పక్కకు పల్టీకొట్టింది. నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిని కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా సేవల్లో మార్పులు..

- పాత సేవలను రద్దు చేస్తూ అధునాతన విధానాలు అమలు
- నేటి నుంచి రిజిస్టర్ పోస్టు సేవలు స్పీడ్ పోస్టులో విలీనం
- పోస్టుబాక్స్‌ల ఎత్తివేతపై ప్రచారం





ఖమ్మంగాంధీచౌక్: తపాలా సేవల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక సాంకేతిక విధానాలతో తపాలా శాఖ దూసుకుపోతోంది. అధునాత సాంకేతిక విధానాలను అవలంబిస్తూ ఈ– సేవలను విస్తరిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ అనేక మార్పులను తీసుకువస్తోంది. సేవలను వేగవంతంగా, ప్రైవేట్ సంస్థలకు పోటీగా నిర్వహించటం కోసం అధునాతన సాంకేతిక విధానాల అమలుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. అంతేగాక పూర్వ కాలం నాటి ఉత్తరాల బట్వాడ, మనియార్డర్ వంటి సేవలే గాక ప్రజల సౌకర్యార్థం అనేక రకాల సేవలు, ప్రభుత్వ పథకాలను తపాలా శాఖ అందిస్తోంది. అందులో భాగంగా పాత విధానాలను కొద్దిగా రద్దు చేస్తూ మరికొన్నింటిలో మార్పులు తీసుకొస్తూ.. నూతన విధానాలను అమలు చేస్తోంది. మొబైళ్లు, ఇంటర్నెట్ సేవలులేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలా శాఖ. అయితే పెరిగిన సాంకేతికతకు అనుగుణంగా తపాలాశాఖ అప్‌గ్రేడ్ అవుతోంది. తాజాగా రిజిస్టర్ పోస్టు సేవా విధానాన్ని మార్చింది. పోస్టు బాక్సుల ఎత్తివేత అంశం తెరపైకి వచ్చింది.

ఇక స్పీడ్ పోస్టులే..

రిజిస్టర్ పోస్టు సేవలకు తపాలా శాఖ మంగళం పాడుతోంది. సెప్టెంబర్ 1 (సోమవారం) నుంచి ఈ సేవలను నిలిపి వేస్తున్నట్లు తపాలా శాఖ ఇప్పటికే ప్రకటించగా.. పోస్టల్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రిజిస్టర్ పోస్టు సేవలను పూర్తిగా స్పీడ్ పోస్టు సేవలో విలీనం చేశారు. దేశీయ పోస్టల్ సేవల క్రమబద్ధీకరణ, పనితీరును మెరుగుపర్చటం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయటం వంటి ప్రక్రియలో భాగంగా స్పీడ్ పోస్టులో రిజిస్టర్ పోస్టును విలీనం చేస్తునట్లు సంస్థ ప్రకటించింది. స్పీడ్ పోస్ట్ అంటే వేగవంతమైన డెలివరీ. స్పీడ్ పోస్టు ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందనే విషయాన్ని ఆన్‌లైన్‌లో గుర్తించవచ్చు. ఇది రిజిస్టర్ పోస్టు సేవల్లో లేదు. కాగా, రిజిస్టర్ పోస్టుల వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సప్, జీ-మెయిల్ వంటి డిజిటల్ సేవలు అందుబాటులోకి రావటంతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాయి. అంతేగాక కొరియర్ వ్యవస్థ పెరిగింది. ఈ ప్రభావం కూడా రిజిస్టర్ వ్యవస్థపై పడింది. గతంతో పోలిస్తే రిజిస్టర్ పోస్టు సేవల వ్యవస్థ ఏకంగా 25 శాతం పడిపోయిందని తపాలా ఉద్యోగులు చెబుతున్నారు.

పోస్టు బాక్సులు కనిపించవా..?

వందల ఏళ్ల చరిత్ర కలిగిన పోస్టు బాక్సుల ఎత్తివేతపై ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాల్లో ఈ అంశం చక్కర్లు కొడుతోంది. దశాబ్దాలుగా నిస్వార్థంగా, నిశ్శబ్దంగా, నిశ్చలంగా, విశ్వసనీయంగా సేవలందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించదన్న బాధ పలువురిలో వ్యక్తమవుతోంది. అయితే ఈ అంశంపై తమకు సమాచారం లేదని, పోస్టు బాక్సుల ఎత్తివేత అవాస్తవమని అధికారులు కొట్టి పారేస్తున్నారు.

మార్గదర్శకాలను పాటిస్తాం



రిజిస్టర్ పోస్టు సేవలను స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారు. తపాలాశాఖ మార్గదర్శకాలను అనుసరించి సేవలను అందిస్తాం. అధునాతన సాంకేతిక విధానాలతో సేవలను వేగవంతం చేయటం కోసం తపాలా సేవల్లో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పోస్టు బాక్సుల ఎత్తివేత ఊహాగానమే. ఎలాంటి ఆదేశాలు లేవు. – వి.వీరభద్రస్వామి, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

ఆగస్టులో దంచి కొట్టిన వాన



వర్షంతో ఐటీహబ్ వద్ద చేరిన వరద నీరు

- సాధారణానికి మించి వర్షపాతం నమోదు
- పెరిగిన పంటల సాగు విస్తీర్ణం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా ఆగస్టులో వానలు దంచి కొట్టాయి. నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఈ నెలలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ ఏడాది జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కాగా, జూలై, ఆగస్టు నెలల్లో సాధారణానికి మించి వర్షాలు కురిశాయి. జూలైతో పోలిస్తే ఆగస్టులో అధిక వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 131.2 మి.మీ. కాగా 123.9 మి.మీ.వర్షపాతం నమోదైంది.జూలైలో సాధారణ వర్షపాతం 240.9 మి.మీ. కాగా 281.6 మి.మీ. వర్షం కురిసింది. ఆగస్టులో 17 రోజులు వర్షాలు దంచికొట్టాయి. నెలలో సాధారణ వర్షపాతం 240.0 మి.మీ. కాగా 389.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. అంటే 62.4 శాతం వర్షపాతం అదనంగా నమోదైంది. ఈ మూడు నెలల్లో మొత్తం 38 రోజులు వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

16 మండలాల్లో అధిక వర్షపాతం

జిల్లాలో మొత్తం 21 మండలాలకు గాను జూన్ నుంచి ఆగస్టు వరకు 16 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, 5 మండలాల్లో సాధారణంగా కురిసింది. రఘునాథపాలెం, తిరుమలాయాపాలెం, వైరా, ఖమ్మం అర్బన్, ఏన్కూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

సమృద్ధి వర్షాలతో పెరిగిన సాగు..

వానాకాలం ఆరంభ నెల మినహా ఇప్పటి వరకు రెండు నెలల్లో సాధారణానికి మించి వానలు కురవడంతో జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని మించింది. పత్తి, వరి వంటి పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 6,08,348 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 6,53,557 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి సాధారణ విస్తీర్ణం 2,87,928 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,84,517 ఎకరాల్లో, పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2,15,643 ఎకరాలు కాగా 2,25,613 ఎకరాల్లో సాగు చేశారు. పెసర సాధారణ సాగు విస్తీర్ణం 16,838 ఎకరాలు కాగా 18,471 ఎకరాల్లో సాగైంది.

విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలో జలాశయాలు నిండడంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో వాగులు, నదుల వెంట ఉన్న వరి, పత్తి, పెసర పంటలకు 3,644 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది.

ఆగస్టు వర్షపాతం ఇలా(మి.మీ.)

మండలం	సాధారణ వర్షపాతం	నమోదైనది
కారేపల్లి	277.0	437.6
కామేపల్లి	281.7	423.2
రఘునాథపాలెం	244.8	315.0
ఖమ్మం రూరల్	238.1	364.8
తిరుమలాయపాలెం	232.2	313.2
కూసుమంచి	205.6	493.2
నేలకొండపల్లి	214.9	419.0
ముదిగొండ	216.4	364.4
చింతకాని	216.0	504.4
ఖమ్మం అర్బన్	245.5	254.8
కొణిజర్ల	227.2	351.6
ఏన్కూరు	281.5	352.8
కల్లూరు	260.1	348.8
పెనుబల్లి	253.4	469.8
సత్తుపల్లి	270.0	469.0
వేంసూరు	229.2	423.2
తల్లాడ	248.1	310.8
వైరా	243.8	370.6
బోనకల్	221.5	435.6
మధిర	214.2	397.6
ఎర్రుపాలెం	219.0	363.6
మొత్తం	5,040.2	8,183.0

సేవ చేసేందుకు స్థాయి అవసరం లేదు..

ఆర్టీసీ మెడికల్ సూపరింటెండెంట్ ఏవీ గిరిసిహారావు



కేక్ కట్ చేస్తున్న ఏవీ గిరిసింహారావు

ఖమ్మంవైద్యవిభాగం: జీవితంలో ఎదో కొంత సాధించిన తర్వాత సేవా కార్యక్రమాలు చేయాలని చాలా మంది అనుకుంటారని, కానీ సేవ చేయడానికి సంపద, స్థాయి అవసరం లేదని అనిత, రవిచంద్ర నిరూపించారని కరీంనగర్ జోనల్ ఆర్టీసీ ఆస్పత్రి సూపరింటెండెంట్, సీనియర్ వైద్యాధికారి ఏవీ గిరిసింహారావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 15వ వార్షికోత్సవం ఖమ్మంలోని సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారి మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం ఇదే ఇంట్లో అనిత, రవిచంద్ర కుటుంబంతో కలిసి డాక్టర్ రాజేశ్‌గార్గె, బాలకృష్ణ, డాక్టర్ రమేశ్‌బాబు, తాను తలసేమియా చిన్నారులకు సేవ చేయడంపై చర్చించుకున్నామని, నాడువేసిన చిన్న విత్తనం నేడు మహావృక్షం అయి వందలాది మంది చిన్నారులు ఈ వృక్షం కింద ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా సహకరిస్తున్నారని చెప్పారు. వ్యవస్థాపకురాలు ప్రొద్దుటూరి అనిత మాట్లాడుతూ.. 15 ఏళ్లలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చేసిన సేవా కార్యక్రమాలు, దాతల సహకారం, అందుకున్నవిజయాలను వివరించారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, చిన్నారులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేణుమాధవ్, నారాయణమూర్తి, నరేశ్‌తోపాటు రమాజ్యోతి, పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

కస్తాల సేవలు మరువలేనివి..



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహ సంక్షేమ అధికారిగా కస్తాల సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎస్సీ డీడీ, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కస్తాల ఎస్సీ సంక్షేమశాఖలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటానికి అహర్నిశలు కృషి చేశారని అభినందించారు. ఉద్యోగంతో పాటు సంఘాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారని అభినందించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సత్యనారాయణ విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దటంలో కృషి చేశారని చెప్పారు. అనంతరం కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సహకరించిన కలెక్టర్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయ ఉద్యోగులు, వసతిగృహ సంక్షేమ అధికారులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, వెంకటపుల్లయ్య, మహేశ్, కొనిదేన శ్రీనివాసరావు, గుడికందుల జ్యోతి, విజయలక్ష్మి, కారుమంచి శ్రీనివాసరావు, సునీల్‌రెడ్డి, వేలాద్రి, రుక్మారావు, వెంకటపతిరాజు, రాజేశ్, రవీంద్రప్రసాద్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, తిరుపతిరావు, విజయ, కోమలి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలో వేర్వేరు పత్రికల్లో రిపోర్టర్లుగా పనిచేస్తున్న బోడపట్ల సతీష్, పోలెపొంగు నాగరాజుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద శనివారం ఇద్దరూ ఘర్షణ పడ్డారని, ఈ క్రమంలో ఇరువురూ పరస్పరం ఫిర్యాదు చేయగా ఇద్దరిపైనా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆదుకుంటాడనుకున్న వ్యక్తి అనంతలోకాలకు..

- తేలుకాటుతో యువకుడి మృతి..
- శోకసంద్రంలో కుటుంబం



పోతుగంటి విజయ్‌కుమార్(ఫైల్)



విజయ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తిరుమలాయపాలెం: పీజీ చదివిన కుమారుడు ఇక కుటుంబానికి ఆసరా అవుతాడనుకుంటే.. తేలుకాటుతో ప్రాణాలు కోల్పోయి.. ఆ కుటుంబానికి తీరనిశోకం మిగిల్చాడు. మంచి ఉద్యోగం సాధించి, ఉన్నతస్థాయిలో నిలుస్తాడని భావించిన ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. తన కుమారుడిని ఉన్నత స్థితిలో చూడాలనుకున్న ఆ తల్లి ఆచేతన స్థితిలో చూసి కన్నీరుమున్నీరైన విషాద ఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని అజ్మీరతండా పరిధిలోని రాకాసితండాకు చెందిన పోతుగంటి రామయ్యకు ఇద్దరు కుమారులు విజయ్‌కుమార్ (26), లక్ష్మీనారాయణ, కుమార్తె మల్లమ్మ ఉన్నారు. లక్ష్మీనారాయణ కొన్నేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమార్తెకు వివాహం కాగా విజయ్‌కుమార్ కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. రైల్వే అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. పొలం పనులు పూర్తి చేసి హైదరాబాద్ వెళ్లాలని అనుకుంటున్న క్రమంలో గత ఆగస్టు 26న పొలంలో రాళ్లు తీస్తున్న క్రమంలో తేలుకాటు వేసింది. అతడిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రి.. అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. చేతికందిన కొడుకు అకాల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలుకింద పడి వృద్ధురాలు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎర్రుపాలెం: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఓ వృద్ధురాలు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన మిద్దె మేరమ్మ (72) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. ఆదివారం రైల్వేస్టేషన్‌కు చేరుకుని గూడ్సు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఖమ్మం రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసుదర్యాప్తు చేస్తున్నారు. మధిరకు చెందిన ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ ద్వారా మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆయిల్‌ఫెడ్ రికార్డ్!



పామాయిల్ గెలలు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌ఫెడ్ రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ తోటల సాగు విస్తరిస్తోంది. ఈ ఏడాది తోటల నుంచి గెలల దిగుబడి మొదలైన నేపథ్యంలో గతంలో నమోదైన రికార్డులను సైతం అధిగమిస్తోంది. రాష్ట్రంలోని 8 జిల్లాలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు విస్తరణ పెరగడంతోపాటు ముదురు, లేత పామాయిల్ తోటల నుంచి దిగుబడి పెరిగింది. ఆదివారం నాటికి అశ్వారావుపేట, దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు జూలైలో 38,341.100 మెట్రిక్ టన్నులు రాగా, ఆగస్టులో 9,291.135 మెట్రిక్ టన్నులు గెలలు వచ్చాయి. రెండు నెలల్లో మొత్తం 47,632.235 మెట్రిక్ టన్నుల గెలలు ఫ్యాక్టరీకి చేరాయి. గతేడాది ఇదే కాలంలో 35,810 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గతం కంటే ఈ సారి దిగుబడి భారీగా పెరగడంతో కొత్త రికార్డు సృష్టించినట్లయింది.

పెరగనున్న గెలల ధర?

పామాయిల్ టన్ను గెలల ధర మరోసారి స్వల్పంగా పెరగనున్నట్లు తెలిసింది. గత నెలలో టన్ను రూ.18,052 ఉండగా, తాజాగా రూ.1000లోపు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల కంటే ముడి పామాయిల్ టన్ను ధరతోపాటు గెలల దిగుబడి పెరగడంతో ఆగస్టు నెలకు సంబంధించి టన్ను ధర పెరిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. పెంపునకు సంబంధించిన జీఓ సోమవారం జారీ కానున్నట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు

భార్య మృతి.. ఆమె భర్తకు గాయాలు



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: నగర పరిధి లోని గోపాలపురం వద్ద ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొట్టగా మహిళ మృతిచెందగా.. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నా యి.. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన పాలిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మి (45) దంపతులు ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. గోపాలపురం వద్దకు రాగానే ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న భద్రాచలం డిపో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో లక్ష్మి ఘటనా స్థలంలోనే మృతిచెందింది. కాగా, తన భార్య బతికేఉందని భావించి, వెంకటేశ్వర్లు చేయిపట్టుకుని లేపేందుకు యత్నిస్తూ కన్నీటిపర్యంతమయ్యాడు. ఇదిచూసిన అక్కడివారు కంటతడి పెట్టారు. అనంతరం స్వల్పంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టేలు చోరీ

కారేపల్లి: ఇంటి ఆవరణలోని గొర్ల షెడ్డులో నుంచి పొట్టేలును ఇద్దరు వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలోని గొర్లషెడ్డులోకి శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి.. రూ.25 వేలు విలువ చేసే పొట్టేలును చోరీ చేశారు. అలికిడి రావటంతో అనుమానం వచ్చిన వెంకటేశ్వర్లు పరిశీలించగా పొట్టేలు కన్పించలేదు. ఆదివారం కారేపల్లి పోలీసులకు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదే గ్రామానికి చెందిన శివ, సురేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకొని, దాచిపెట్టిన పొట్టేలును పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీలో నగదు మాయం..?

కమర్షియల్ టాక్స్ రూ.6లకు ఫైగా పక్కదారి



వైరా మున్సిపాలిటీ కార్యాలయం

వైరా: వైరా మున్సిపాలిటీలో అవినీతి, నిధుల ఘటనలు పరిపాటిగా మారాయి. రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం పెరగడం, మరో వైపు పాలక వర్గం లేక పోవడం అవినీతికి అడ్డులేకుండాపోయింది. ఇటీవల మున్సిపాలిటీలో ఐదుగురు ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌లు ప్రతి నెలా మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల పన్ను వసూళ్లలో వచ్చిన నగదును మున్సిపాలిటీలో జమ చేయకుండా తమ సొంత అవసరాలకు వాడుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 5 షాపులు ఉండగా పాత బస్టాండ్ సమీపంలో మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 33 దుకాణాలకు ప్రతి నెలా కమర్షియల్ టాక్స్ రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేయాల్సి ఉంది. రెండు నెలలుగా ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్‌లు వసూలు చేసిన నగదును నిబంధనల మేరకు మున్సిపాలిటీలో చెల్లించాలి. జూనియర్ అకౌటెంట్ సుధీర్, మేనేజర్ సుధాకర్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి వసూలు చేసిన నగదు జమ విషయంలో అలసత్వం ప్రదర్శించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ యు.గురులింగం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ పన్నులు, పెండింగ్ బిల్లులు, కమర్షియల్ టాక్స్ విషయమై ఆరా తీయగా నగదు స్వాహా అయిన విషయం వెలుగులోకి వచ్చింది. మున్సిపాలిటీలో రెగ్యులర్ బిల్ కలెక్టర్‌లుగా వార్డు ఆఫీసర్‌లు ఉండాల్సి ఉండగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అప్పగించి రెగ్యులర్ ఉద్యోగులు చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై కమిషనర్ గురులింగాన్ని వివరణ కోరగా.. నగదు స్వాహా చేసిన విషయంపై విచారణ చేశానని, రశీదుల్లో రాసిన నగదు, బిల్ కలెక్టర్‌లు చెల్లించిన నగదు సమానంగా ఉన్నాయన్నారు. బిల్ కలెక్టర్‌లు వసూలు చేసిన వెంటనే కార్యాలయంలో అప్పగించని మాట వాస్తవమేనని, అందుకు బాధ్యులైన వారికి నోటీసులు ఇచ్చి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.